ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

● జిల్లా అదనపు డీఆర్‌డీఓ జి.సురేశ్

మండల కేంద్రంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు డీఆర్‌డీఓ సురేశ్

గుండాల, మార్చి 23: ఉపాధి హామి కూలీలకు రోజు కనీస కూలి రూ.272 వచ్చేలా చూడాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు డీఆర్‌డీఓ జి.సురేశ్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంతో పాటు రామారం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఏపీఓ ఇమ్యానియేల్‌ను ఆదేశించారు. అంతకు ముందు నర్సరీలను పరిశీలించి షేడ్‌నెట్లు ఏర్పాటు చేసి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట టీఏలు పల్లవి, సోమయ్య, మత్స్యగిరి, పంచాయతీ కార్యదర్శులు రమేష్, సరిత, ఫీల్డ్ అసిస్టెంట్లు పరషురాములు, నవనీత ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు : ఎంపీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీశైలం

యాదగిరిగుట్ట, మార్చి 23 : ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సభ ప్రారంభం కాగానే పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాలల్లోనే నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగమ్మ తెలుపగా.. ఆయన స్పందించి మాట్లాడారు. ఎక్కడెక్కడ భవనాలు అవసరమో నివేదిక ఇవ్వాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, అలాంటి సమస్యలు రాకుండా చూడాలని విద్యుత్ అధికారులను కోరారు. పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వర్షాకాలంలోపు చెరువుల ఫీడర్ చానళ్లను పునరుద్ధరించాలని ఉపాధిహామీ పథకం అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, ఎంపీడీఓ నవీన్‌కుమార్, డిప్యూటీ తాసీల్దార్ నరసింహారావు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో యువకుల మధ్య స్నేహభావం

● తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి

వలిగొండ, మార్చి 23: క్రీడలతో యువత మధ్య స్నేహభావం పెంపొంతుందని తాసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్రూరు గ్రామంలో అఖిల భారత యువజన సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 93వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్, సుద్దాల సాయికుమార్, మేడి దేవేందర్, పోలెపాక యాదయ్య, బండారు నరసింహారెడ్డి, బుర్ర నర్సింహ పాల్గొన్నారు.

వరి కోత ప్రయోగానికి రైతులు సహకరించాలి

● డివిజన్ ఉపగణాంక అధికారి అనిల్‌బాబు

వరికోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అనిల్‌బాబు

మోత్కూరు, మార్చి23: వరి పంట ప్రయోగానికి రైతులు సహకరించాలని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ఉపగణాంక అధికారి అనిల్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని సదర్మాపురంలో దొండ యాదయ్య చేలో వరి కోత ప్రయోగంను నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5మీటర్ల వెడల్పులో వరి పంట కోత ప్రయోగం నిర్వహించగా 18.6కిలోల ధాన్యం రాగా ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఎంపీఎస్ఓ జి. కృష్ణ, ఏఈఓ ముప్పిడి అశోక్ పాల్గొన్నారు.

ప్రతి పక్షాలే లక్ష్యంగా బీజేపీ దాడులు

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యాదగిరి

మాట్లాడుతున్న బొల్లు యాదగిరి

మోత్కూరు, మార్చి23: ప్రతి పక్ష పార్టీలను బలహీన పర్చడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులకు పాల్పడుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి అన్నారు. శనివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజల హక్కులను కాలరాస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థలైన ఈడీ, ఐటీ, సీబీఐను సొంత ప్రయోజనాల కోసం వాడు కుంటుందన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎంత అవినీతి ఉన్నా, బీజేపీ నాయకులపై ఆరోపణలు వచ్చినా పట్టించుకోకుండా, ఇతర పార్టీలున్న రాష్ట్రాల్లో మాత్రం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం అందులో భాగమే అన్నారు. బీజేపీ విధానాలను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా తిప్పి కొట్టాలని కోరారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంటన్న రుస్యయ్య, నాయకుడు అంజయ్య ఉన్నారు.

అవినీతిని ప్రశ్నించినందుకే బదిలీ

మాట్లాడుతున్న నార్ముల్ డెయిరీ రూట్ సూపర్‌వైజర్ రాజీవ్‌గౌడ్

యాదగిరిగుట్ట, మార్చి23: వంగపల్లి నార్ముల్ పాల శీతలీకరణ కేంద్రంలో జరుగున్న అక్రమాలను ప్రశ్నించినందుకే తనపై మేనేజర్ సత్యనారాయణ, డైరెక్టర్ కందాల అలివేలు రంగారెడ్డి కక్ష సాధింపు చర్యగా తనను బదిలీ చేశారని పాల శీతలీకరణ కేంద్రం రూట్ సూపర్‌వైజర్ కానుగు రాజీవ్‌గౌడ్ ఆరోపించారు. శనివారం పాల శీతలీకరణ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడారు. వంగపల్లి పరిధిలో 23 గ్రామాల నుంచి పాల సేకరణ జరుగుతుందన్నారు. ప్రతి సొసైటీకి 5 పాయింట్ల చొప్పున ఫ్యాట్‌ను కట్ చేస్తున్నారని, కానీ నార్ముల్ డైరక్టర్ గ్రామమైన మహబూబ్‌పేట సెంటర్‌కు మాత్రం 10 పాయింట్ల ఫ్యాట్ కలపుతున్నారని, దీనిపై ప్రశ్నించినందుకే కక్ష్యసాధింపు చేపడుతున్నారని ఆరోపించారు. అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నార్ముల్ ఎండీ కృష్ణ, చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డిని కోరారు.

ఆరోపణల్లో నిజం లేదు :నార్ముల్ డైరెక్టర్

తమపై రూట్ సూపర్‌వైజర్ కానుగు రాజీవ్‌గౌడ్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని నార్ముల్ డైరెక్టర్ కందాల అలివేలురంగారెడ్డి వివరణ ఇచ్చారు. వంగపల్లిలో 9 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారిలో ఇద్దరిని భువనగిరికి బదిలీ చేయాలని ప్రధాన కార్యాలయం వారు చెప్పడంతో బదిలీలు జరిగాయన్నారు. అందులో ఒక ఉద్యోగి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతుండడంతో కానుగు రాజీవ్‌ను మాత్రం భువనగిరికి బదిలీ చేశామన్నారు.

డబుల్ బెడ్రూంలు కేటాయించాలని ఆందోళన

భువనగిరి పట్టణ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

భువనగిరి అర్బన్, మార్చి 23: భువనగిరి పట్టణ పరిధిలోని సింగన్న గూడెం చౌరస్తా వద్ద గల డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద శనివారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. గత కేసీఆర్ ప్రభుత్వం భువనగిరి పట్టణానికి సంబంధించిన నిరుపేదలకు 444 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. అంసెంబ్లీ ఎన్నికలకు ముందే లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను కూడా ఎంపిక చేసింది. అయితే ఎన్నికల ప్రక్రియ కారణంగా ఇండ్ల కేటాయింపు ఆగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 100 రోజుల గడిచినా ఇండ్లను కేటాయించక పోవడంతో లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. గత ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసిందని, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇండ్లను కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు.

ఇండ్లు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

గత ప్రభుత్వం నిర్మించి తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ లబ్ధిదారులు శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన వారికే ఇండ్లను కేటాయించాలని కోరారు. దాంతో ఎమ్మెల్యే స్పందించి ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున జూన్ 4 తర్వాత వసతులు కల్పించి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి కల్యాణానికి రండి

● ఎమ్మెల్యే మందుల సామేలుకు ఆలయ కమిటీ ఆహ్వానం

ఎమ్మెల్యే మందుల సామేలుకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రామచంద్రుగౌడ్, ప్రతినిధులు

మోత్కూరు, మార్చి 23 : మోత్కూరులో కొలువైన రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. సోమవారం తెల్లవారు జామున జరుగనున్న స్వామి వారి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య, బీసు యాదగిరి, బొల్లేపల్లి సీతయ్య, పట్టూరి అంజయ్య, మెంట నగేశ్, మూల నర్సింహ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 23 : మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెటింగ్ కమిటీల నిర్వహణ, చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి : జడ్పీ సీఈఓ శోభారాణి

రహీంఖాన్‌గూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్, మార్చి 23 : మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలని జడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆమె పరిశీలించారు. పలు గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ నర్సింహారెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వెల్లంకి గ్రామవాసికి డాక్టరేట్

ఎర్రోళ్ల అశోక్

రామన్నపేట, మార్చి23: మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల అశోక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ శనివారం పీహెచ్‌డీ ప్రకటించింది. రాజనీతి శాస్త్రంలో రాజకీయాల్లో దివ్యాంగుల భాగస్వామ్యం తెలంగాణలో అధ్యాయనం అనే అంశంపై విశ్రాంత ప్రొఫెసర్ జాడి ముసలయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి సమర్పించిన గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. డాక్టరేట్ పొందిన అశోక్‌ను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, మాజీ సర్పంచులు ఎడ్ల మహేందర్‌రెడ్డి, తాళ్లపల్లి సత్తిరెడ్డి, కూరెళ్ల నర్సింహాచారి, నాయకులు మాడూరి ప్రభాకర్, తాళ్లపల్లి మధుసూదన్ రెడ్డి అభినందించారు.

ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రామన్నపేట, మార్చి 23: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని లయన్స్‌క్లబ్ చార్టర్డ్ ప్రెసిడెంట్ యాపాల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో క్లబ్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సంజీవరెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, పీఆర్ ఏఈ గాలయ్య, ఎస్ఐ మల్లయ్య, గుత్తా నర్సిరెడ్డి, సూర్యనారయణ, గోవర్ధనాచారి, పనకంటి భాస్కర్‌రావు, విజయానందం, యాదిరెడ్డి, అనంతచారి పాల్గొన్నారు.

యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

● సీపీఎం మండల కార్యదర్శి లింగారెడ్డి

భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 :చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు భగత్‌సింగ్ అని, యువత ఆయన స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి పగిల లింగారెడ్డి కోరారు. శనివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రానున్న లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మంచాల మధు, జగన్, సాయి, పరమేశ్, శివకుమార్, యాదగిరి పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుంటాం

● కురుమ సంఘం మండలాధ్యక్షుడు మహేందర్



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గజమాలతో సత్కరిస్తున్న కవిడె మహేందర్

యాదగిరిగుట్ట, మార్చి23: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉద్యమ నేత క్యామ మల్లేశ్‌ను ప్రకటించడంపై కురుమ సంఘం మండలాధ్యక్షుడు కవిడె మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో క్యామ మల్లేశ్‌ను కలిసి గజమాలతో సత్కరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి బీసీ బిడ్డను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కురుమ కులస్తుడైన క్యామ మల్లేశ్‌కు టికెట్ కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, కురుమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడికి పలువురి శుభాకాంక్షలు



జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రామ్ చందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మోత్కూరు/అడ్డగూడూరు, మార్చి23: ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రామ్‌చందర్‌ను శనివారం హైదరాబాద్‌లో పలువురు దళిత సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి అవిలయ్య, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్ శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. బలహీన వర్గాల వారిపై నిత్యం దాడులు, వేధింపులు తీవ్రవయ్యాయని, వాటి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. వారి వెంట దళిత సంఘాల నాయకులు రాము, నరేశ్, సురేశ్ ఉన్నారు.

వలిగొండకు ఆర్టీసీ బస్సు నడిపించాలని వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

భువనగిరి అర్బన్, మార్చి 23 : భువనగిరి నుంచి మండలంలోని గౌస్‌నగర్ మీదుగా వలిగొండ వరకు ఆర్టీసీ బస్సును నడిపించేలా కృషి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాక వెంకటేశ్‌తో కలిసి వివిధ గ్రామాల ప్రజలు శనివారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ మార్గంలో గతంలో బస్సులు నడిపించారని, కొన్నేండ్లుగా రద్దు చేయడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళ్లల్లో బస్సును ఏర్పాటు చేయడం వల్ల వలిగొండ మండలంలోని దాసిరెడ్డిగూడెం, రెడ్లరేపాక, కంచనపల్లి, భువనగిరి మండలంలోని గౌస్‌నగర్, ఎర్రంబెల్లి, తుక్కాపూర్ గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని తెలిపారు. ఈ విషయమై స్పందించిన ఎమ్మెల్యే బస్సు ఏర్పాటు చేయాలని యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కు ఫోన్‌లో సూచించారు.

లక్ష్మీనారాయణ స్వామికి లక్ష పుష్పార్చన

స్వామివారికి లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు, భక్తులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 : పట్టణ కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కండేశ్వరస్వామి ఆలయం నుంచి లక్ష్మీనారాయణస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి పుష్పాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా నాయకుడు తడక వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ అంకం వినోద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, కౌన్సిలర్లు మోటే రజితారాజు, భోగ భానుమతి, నాయకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మార్కండేయనగర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వేజర్ పద్మ

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని మార్కండేయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలు ఎక్కువ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జి. వసంత, కర్నాటి చందన, సరస్వతి జయమ్మ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

హన్మాపురంలో ఎండిన వరి చేనును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి23 : పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని హన్మాపురం గ్రామంలో ఎండిన వరి చేలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నష్ట పోయిన రైతులకు పరిహారం అందించాలన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు చీర్క సురేశ్‌రెడ్డి, కిసాన్‌మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనం శివకుమార్, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు పకిర్ రాజేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

వలిగొండ, మార్చి 23 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వేములకొండ గ్రామ శివారు మూసీ పరివాహక ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి గడ్డపాటి సురేశ్‌కు చెందిన లారీని పట్టుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు. లారీ ఓనర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వలిగొండ, మార్చి 23: మండలంలోని అర్రూరు గ్రామానికి చెందిన దామెర లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. సహాయనిధి నుంచి మంజూరైన రూ.19,800 చెక్కును శనివారం కాంగ్రెస్ మండల నాయకుడు బండారు నార్సింహారెడ్డి అందించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల శ్రీనివాస్, పోలెపాక చంద్రయ్య, కసరబోయిన లింగయ్య, చిలకమర్రి కనకాచారి, జినుకల మల్లేశం, తుమ్మల సంతోష్, అంజయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

రామన్నపేట, మార్చి 23: మండలంలోని బోగారం గ్రామానికి చెందిన జెల్ల అండాలు శుక్రవారం రాత్రి మృతి చెందింది. ప్రముఖ వ్యాపార వేత్త కూనూరు సాయికుమార్ శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట గోగు సత్తయ్య, గంపల రాంచంద్రారెడ్డి, రాపోలు బలరాం ఉన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

నందికొండ, మార్చి 23 : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన, మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 12వ తేదీతో గడవు ముగుస్తుందని మహాత్మా జ్యోతిబా పూలే నందికొండ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన వారు 2024-25 విద్యా సంవత్సరానికిగానూ డిగ్రీ ప్రథమ సంవత్సర ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 28న నిర్వహిస్తారని, వివరాల కోసం 9490570303 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.